క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక కొంగారెడ్డిపల్లె సెక్షన్‌లో ట్రీ కటింగ్స్ పనుల నిమిత్తం శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈ మేరకు భరత్‌నగర్, లక్ష్మీనగర్ కాలనీ, బీవీరెడ్డి కాలనీ, జడ్జి బంగ్లా ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు మార్పును గమనించాలని కోరారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



108 సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ సుదర్శన్

బంగారుపాళెం: రోగులకు సిబ్బంది మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ డాక్టర్ సుదర్శన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ విభాగం, 108 సేవలు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ రోగులపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. ఆపదలో ఉన్న వారికి 108 సేవలు సకాలంలో అందించాలన్నారు.

నేడు మండల సమావేశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మండల అధికారులు విధిగా హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బాల్య వివాహాలను నిర్మూలించడమే లక్ష్యంగా తమ సంస్థ పనిచేస్తుందని రియల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామారావు తెలిపారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27వ తేదీన జాతీయ బాల్య వివాహ ముక్త్ భారత్ అనే ప్రచార కార్యక్రమాన్ని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి ప్రారంభించారని చెప్పారు. దీనికి తమ సంస్థ పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ చిత్తూరు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ హనీషా, మురళీమోహన్, కరుణ శేఖర్, భువనేశ్వరి పాల్గొన్నారు.

గృహాలకు డిజిటల్ కీ ఏర్పాటు



అరగొండ మసీదులో అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చిరంజీవి

తవణంపల్లె: మండలంలోని గ్రామాల్లో ఇళ్ల వద్ద దొంగతనాలు అరికట్టి దొంగల ముఠాలను పట్టుకోవడానికి డిజిటల్ కీ ఏర్పాటు చేస్తామని ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. అరగొండ మసీదులో శుక్రవారం ముస్లింలకు డిజిటల్ కీ, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని దేవాలయాలు, చర్చిలు, మసీదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా ఇళ్లకు డిజిటల్ కీ ఏర్పాటు చేస్తామని వివరించారు.

సాయిల్ హెల్త్ కార్డులతో రైతులకు లాభాలు



రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు అందిస్తున్న ఏఓ లక్ష్మీప్రసన్న

కార్వేటినగరం: సాయిల్ హెల్త్‌కార్డులతో రైతులకు అనేక లాభాలు కలుగుతాయని జిల్లా వనరుల కేంద్రం ఏఓ లక్ష్మీప్రసన్న అన్నారు. మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల నుంచి 260 మట్టి నమూనాలను జియో కోఆర్డినేట్ ద్వారా శుక్రవారం సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా వనరుల కేంద్రం ఏఓ మాట్లాడుతూ సాయిల్ హెల్త్ కార్డుల ద్వారా సాగు చేసిన పంటలకు అనుగుణంగా ఎరువుల వాడకం తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఆ సారానికి తగినట్లు పంటలు పండించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. అనంతరం ఆలత్తూరు, బట్టువారిపల్లి, కొల్లాగుంట గ్రామాల్లో మట్టి నమూనాలను సేకరించారు. అలాగే సాయిల్ హెల్త్ కార్డులను రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హేమలత, వీఏఏ కల్పనతోపాటు రైతులు పాల్గొన్నారు.

రూ.1500 వేస్తారంట.. నిజమేనా?

సుగుణమ్మ: ఏమ్మేయ్.. యాడికి గుంపులు గుంపులుగా పోతా ఉండారు.

రమణమ్మ: మహిళలకు రూ.1500 అకౌంట్లో ఏస్తారంట కదా. దానికి పోస్టాఫీసులోనే అకౌంట్ ఓపెన్ చేయాలంట. బ్యాంకుల్లో వేస్తే ఏమీ.. ఇంతకుముందంతా బ్యాంకుల్లోనే కదా వేసింది.

సుగుణమ్మ: అయ్యో నా తల్లా.. చెప్పిందంతా చేసేదానికి ఆడుండేది జగనన్న అనుకుంటివా.. చంద్రన్న! ఆయన ఎప్పుడైనా చెప్పింది చేసిండాడా? ఇన్నాళ్లుగా ఆయన్ను చూస్తా ఉండావు.. ఇంకెప్పుడు తెలుసుకుంటావో ఏమో! వాలంటీర్లకు రూ.20 వేలు ఇస్తామని చెప్పినాడు.. ఇచ్చినాడా.. అసలు వాలంటీర్లు కంటికి కనిపిస్తా ఉండారా చెప్పు! అన్నీ తెలిసి పరిగెత్తుకుంటా పోతా ఉండావు!

రమణమ్మ: ఈ సారి ఏమైనా సేస్తాడేమో.. అందరూ అకౌంట్లు ఓపెన్ చేస్తా ఉండారు. ఒకవేళ డబ్బులిచ్చేస్తే.. నాకు రాదు కదా! అందుకే నేనూ చేసేస్తా..

ఇదీ చిత్తూరు తపాలా కార్యాలయం సమీపంలో ఇద్దరు మహిళల (పేర్లు మార్చాం) సంభాషణ!

- తపాలా కార్యాలయం మహిళలతో కిటకిట
- కూటమి సర్కారు రూ.1500 జమచేస్తారనే ప్రచారం
- పోస్టాఫీసుల వద్దకు క్యూ కడుతున్న మహిళలు
- ఐపీపీబీ అకౌంట్ ఓపెన్ కోసం ఆరాటం



తపాలా కార్యాలయం వద్ద కిక్కిరిసిన మహిళలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన తపాలా కార్యాలయం మహిళల తాకిడితో కిక్కిరిసిపోతోంది. 18 ఏళ్లపైబడిన మహిళలందరి వ్యక్తిగత ఖాతాల్లో కూటమి ప్రభుత్వం రూ.1500 జమచేస్తారన్న ప్రచారంతో మహిళలు పోస్టాఫీసుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రతి రోజు చలిని సైతం లెక్క చేయకుండా అకౌంట్ ఓపెన్ కోసం క్యూ కడుతున్నారు. నాలుగు రోజులుగా 1000 మందికి పైగా ఖాతాలు ఓపెన్ చేయడం గమనార్హం. రోజురోజుకూ వీరి సంఖ్య మరింతగా పెరుగుతోంది. పోస్టాఫీసుల వద్ద తోపులాట జరిగే స్థాయి ఉందంటే మహిళల తాకిడి ఎలా ఉందో అర్థమవుతుంది.

హామీ నెరవేరుస్తారేమోనని ఆశ

టీడీపీ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తామంటూ కూటమి నేతలు పదేపదే చెబుతున్నారు. అందులో భాగంగా 18 ఏళ్లు నిండిన మహిళ ఖాతాల్లో రూ.1500 జమ చేస్తారని ప్రచారాన్ని జనం మధ్యలోకి కూటమి నేతలు తీసుకెళ్లారు. దీంతో మహిళలు అది నిజం అని నమ్మి పోస్టాఫీసులు చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాస్తున్నారు. నగదు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతా కోసం మహిళలు తపాలా కేంద్రాలకు వెళుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించి ఐపీపీబీ (ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్) ఖాతాల్లో జమవుతాయి. ఇందులో ఖాతాలు తెరిచినంత మాత్రాన లాభం లేదని ఆధార్ లింక్ కలిగి ఉండాలని ప్రచారం చేస్తున్నారు. బ్యాంకర్లు ఖాతాలకు ఆధార్ లింక్ చేస్తున్నా, సీడింగ్ చేయడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ కారణంగా మహిళలు తపాలాశాఖ ఇచ్చే ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు భారీగా తరలివస్తున్నారు. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ కానివారు జిల్లాలో లక్షలాది మంది ఉన్నట్లు సమాచారం. బ్యాంకుల్లో ఆధార్ సీడింగ్ కానీ మహిళలు ఐపీపీబీ ఖాతాల కోసం తపాలా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు.

అకౌంట్స్ ఓపెన్ చేస్తున్నారు

గత నాలుగు రోజులుగా ఐపీపీబీ ఖాతాలు భారీగా ఓపెన్ అవుతున్నాయి. అధిక సంఖ్యలో మహిళలు కొత్త అకౌంట్స్ ఓపెన్ చేసుకుంటున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. సందేహాలను సిబ్బంది నివృత్తి చేస్తున్నాం. అయితే ఎందుకు ఇంతమంది ఒకేసారి వచ్చి ఓపెన్ చేస్తున్నారనే విషయం మాకు తెలియదు.

–లక్ష్మణ, సూపరింటెండెంట్, జిల్లా తపాలాశాఖ



అకౌంట్ ఓపెన్ చేసుకుంటున్న మహిళలు

ఎలా మొదలైంది

ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)లో ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియ వేగంగా జరుగుతోంది. చాలామందికి బ్యాంకు ఖాతా ఉన్నప్పటికీ ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు లింక్ అవడం లేదు. అలాంటి వారు సంబంధిత తపాలా కార్యాలయాల్లో సంప్రదించి ఐపీపీబీ ఖాతాను ప్రారంభించాలని తపాలా అధికారులు ప్రకటించారు. ఇటీవల విజయవాడ వరదల్లో నష్టపోయిన బాధితుల బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ లేకపోవడంతో పరిహారం సకాలంలో జమకాలేదన్నారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం గమనించి, బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం ఆవశ్యకత గురించి సూచనలు చేసింది. ఈ ప్రకటన ద్వారా మహిళలకు రూ.1500 పడాలంటే పోస్టల్ అకౌంట్ ఉండాలనే విధంగా ప్రజల్లోకి వెళ్లింది. ఫలితంగా మహిళలు పోస్టాఫీసుల చుట్టూ తిరుగుతున్నారు.

ఈ ప్రచారంపై స్పందించాలి

ఉన్నతాధికారులు జరుగుతున్న ప్రచారంపై స్పందించాల్సిన అవసరం ఉంది. మహిళలు రూ.1500 చొప్పున ఖాతాల్లో ఎప్పుడు జమచేస్తారు. అందుకోసం మహిళలు ఏమి చేయాలి. ఇప్పటికే బ్యాంకు ఖాతాలు ఉన్న మహిళలు ఏం చేయాలి. ఖాతాలు లేని వారు ఏ పోస్టాఫీసు లేదా ఏ బ్యాంకును సంప్రదించాలనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరోవైపు రూ.1500 ఒట్టి ప్రచారమన్న భావన మరి కొందరిలో వినిపిస్తోంది.

సంతపేట సబ్‌స్టేషన్ తనిఖీ



సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సంతపేట సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. సాధారణ పరిశీలనలో భాగంగా సెక్షన్ ఆఫీసులో తనిఖీ చేశారు. సెక్షన్ పరిధిలో మొత్తం సర్వీసులు, ఫీడర్ల సంఖ్యపై ఆరా తీశారు. లైన్‌లాస్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. నెలవారీ విద్యుత్ బిల్లులు వందశాతం వసూలు చేయాలన్నారు. సబ్‌స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచుకుని, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణను లైన్‌ఇన్‌స్పెక్టర్లు చూడాలన్నారు. లైన్ ఎన్నిసార్లు ట్రిపింగ్ అవుతుందన్న విషయం ఓ పుస్తకంలో నమోదు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు మార్పు చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ జగదీష్, డీఈ ప్రసాద్, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జంబువారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దాత జగదీష్‌రెడ్డి

బంగారుపాళెం: మండలంలోని జంబువారిపల్లె దళితవాడలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించారు. దండువారిపల్లెకు చెందిన ఆదర్శ రైతు, దాత జగదీష్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహాయ సహకారాలు అందజేశారు. విగ్రహాన్ని దాత చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఆయన మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అంబేడ్కర్ చేసిన కృషిని గొప్పదని కొనియాడారు. అనంతరం దాత జగదీష్ రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సస్యరక్షణ మామిడికి శ్రీరామ రక్ష

- కవర్లు కడితే నాణ్యమైన మామిడి
- జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్ రెడ్డి



అరగొండలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి

తవణంపల్లె: మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపడితే, అవి పంటకు శ్రీరామరక్షగా నిలుస్తాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్ రెడ్డి తెలిపారు. మండలంలోని అరగొండలో ఉన్న కల్యాణ మండపంలో శుక్రవారం మామిడిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి ప్రసంగించారు. నాణ్యమైన, అధిక దిగుబడి సాధించడానికి రైతులు కోడిగుడ్డు దశలో మామిడి కాయలకు కవర్లు తప్పక కట్టాలని చెప్పారు. రైతులకు కవర్లను 50 శాతం సబ్సిడీతో ఒక్కొక్క కవరును ఒక్క రూపాయికి సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో నాణ్యమైన మామిడి పంట దిగుబడి సాధించేందుకు రైతుల సౌకర్యార్థం కోటి కవర్లు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మామిడి పంట వాతావరణ పరిస్థితులను బట్టి సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు అధిక ఆదాయం, నాణ్యమైన పంట దిగుబడి సాధించాలంటే కవర్లు తప్పక వాడాలని వివరించారు. జనవరి నుంచే రైతు సేవా కేంద్రాల్లో కవర్లు అందుబాటులో ఉంటాయన్నారు. డబ్బులు ముందుగా చెల్లించిన రైతులకు కవర్లు సరఫరా చేస్తామని చెప్పారు.

తేనెమంచు తెగులుతో జాగ్రత్త

మామిడిని ఆశించే పురుగులు, తెగుళ్ల గురించి డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల ప్రొఫెసర్, కీటక శాస్త్రవేత్త రామయ్య విశదీకరించారు. సస్యరక్షణతోనే మామిడి పంటను కాపాడుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా తేనెమంచు పురుగుల ఉధృతి తీవ్రంగా ఉందన్నారు. దీంతో పాటు తామర పురుగులు, కాండం తొలుచు పురుగులు, పండుఈగ, ఆంత్రాక్నోస్, బూడిద, పూతమాడు తెగుళ్లు ఆశిస్తాయని వివరించారు. తేనె మంచు పురుగు నివారణకు లీటరు నీటిలో బ్రూఫ్రోఫెజిన్ 25 ఇసి మందు 1.5ఎంఎల్ లేదా ఎసిఫేట్ 50 శాతం డబ్ల్యూపి మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆంత్రాక్నోస్ తెగుళ్ల నివారణకు థయోఫినేట్ మిథైల్ 70 శాతం డబ్ల్యూపి మందు ఒక గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని చెప్పారు. లేకుంటే అజాక్సీస్ట్రోబిన్ 23 శాతం ఎస్‌సి మందు ఒక ఎంఎల్ లీటరు నీటిలో పిచికారీ చేయాలని వివరించారు.

25 వేల హెక్టార్లలో డ్రిప్

జిల్లాలో 25 వేల హెక్టార్లలో డ్రిప్ ఇరిగేషన్ చేపట్టేలా లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు ఏపీఎంఐపీ డీడీ బాలసుబ్రమణ్యం తెలిపారు. 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు 90 శాతం కింద డ్రిప్ ఇరిగేషన్ మంజూరు చేస్తామన్నారు. 5 ఎకరాలు పైబడి 10 ఎకరాల్లోపల ఉన్న రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ కింద పరికరాలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు త్వరగా రైతుల వాటాను డీడీలు తీసిస్తే త్వరగా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో బంగారుపాళ్యం ఉద్యానశాఖ అధికారి సాగరిక, తవణంపల్లె మండల వ్యవసాయాధికారి జి.ప్రవీణ్, జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, అరగొండ సర్పంచ్ మల్లుదొరై, రైతు సేవా కేంద్రం సిబ్బంది, మామిడి రైతులు పాల్గొన్నారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి

- తెగుళ్లు, చీడపీడల బెడద తక్కువ
- కలుపు సమస్యకు చెక్
- నేలలు మరింత సారవంతం



ఐరాల మండలంలో సాగవుతున్న కంది పంట

ఐరాల: వ్యవసాయంలో ఎప్పుడూ ఒకే రకమైన పంటలు సాగు చేస్తే దిగుబడులు తగ్గుతాయి. చాలా మంది రైతులు ఇప్పటికీ ఒకేరకమైన పంటలను పండిస్తూ సరైన దిగుబడులు రాక ఆర్థికంగా చితికిపోతున్నారు. ఏటేటా పంట మార్పిడి చేస్తే నాణ్యమైన ఉత్పత్తులు వచ్చి దిగుబడులు రెట్టింపయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు స్పష్టం చేస్తున్నారు. రబీలో పంటలు సాగు చేస్తున్న రైతులకు పంటమార్పిడి విధానంపై పలు సూచనలు చేశారు.

పంట మార్పిడిపై అవగాహన అవసరం

పంట మార్పిడి విధానాన్ని అవలంభిస్తే తెగుళ్ల బెడద తగ్గుతుంది. దీనిపై చాలా మంది రైతులకు అవగాహన లేదు. ఒకరిని చూసి మరొకరు వేసిన పంటనే వేస్తూ నష్టాల పాలవుతున్నారు. పంట మార్పిడి మూలంగా నేల భౌతిక స్థితి మెరుగుపడుతుంది. భూమిలో నీరు నిల్వ ఉండే శక్తి కలిగి భూసారం వృద్ధి చెందుతుంది. దీని వల్ల చీడపీడల బెడద అస్సలుండదు. ఫలితంగా సస్యరక్షణకు వినియోగించే మందుల ఖర్చు తగ్గించవచ్చు. శిలీంధ్ర తెగుళ్లను దూరం చేయవచ్చు. బీజాలు వాటి అవశేషాలు, వానపాముల అభివృద్ధి ఎక్కువవుతుంది. కీటకాల గుడ్లు వృద్ధి చెందవు. పంటలో నాణ్యత పెరిగి గిట్టుబాటు ఎక్కువగా పొందే అవకాశం ఉంది.

ఏడాదికి రెండు పంటలు

భూమిలో తేమ ఎక్కువ కాలం నిల్వ చేసే శక్తి ఉన్నప్పుడు పంట తర్వాత వేరే పంటను సాగు చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి. తేలికపాటి నేలలు, ఎర్ర ఇసుక నేలల్లో మిశ్రమ పంటలు వేసుకోవాలి. వర్షాకాలం ఎక్కువ పంటకాలం కలిగిన కంది, వేరుశనగ వంటి పంటలు వేసుకోవాలి. బంకమన్ను శాతం ఎక్కుగా ఉండే ఎర్రనేలలు, పల్లపు ప్రాంతాల్లో పంట మార్పిడి చేసి ఏడాదిలో రెండు పంటలు పండించుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పంట మార్పిడిలో నేల ఉపరితలాన్ని పూర్తిగా కప్పే పంటలను ఎంపిక చేసుకోవాలి. మినుము, ఉలవలు, పెసర పంటలను వేయడం వల్ల నేలను పూర్తిగా కప్పి ఉంచుతాయి. దీంతో కలుపు మొక్కలను నివారించవచ్చు. వేరుశనగ తర్వాత జొన్న, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు వంటి ఆరుతడి పంటలను పండించాలి. దీని వల్ల వేరుశనగ పంటలను ఆశించే ఆకు ముడత ఉధృతిని నివారించవచ్చు. వరి పైరు తర్వాత పప్పు ధాన్యాల పంటలు గాని నూనె గింజల పైర్లను పండించడం వల్ల వరి పంటను ఆశించే దోమ పోటులను సమర్థంగా నివారించవచ్చు. పెసర, పశుగ్రాసంగా జొన్న సాగు చేస్తే తర్వాత వేరుశనగ పంటలు వేసుకోవాలి.

సూచనలు

జొన్న సాగు తర్వాత మళ్లీ అదే పంట వేయకూడదు. దీని వల్ల ఎర్రగొంగళి పురుగు, శనగపచ్చ పురుగు ఆశించవచ్చు. వేరుశనగ తర్వాత ఆముదంతో పంట మార్పిడి చేసుకోవచ్చు. నులిపురుగులు ఉన్న ప్రాంతాల్లో వంగ, బెండ, టమాట, మినుము, పెసర పంటలు వేస్తే అవి వాటిని మరింత అభివృద్ధి చేస్తాయి. వర్షాకాలంలో వరి సాగు చేసిన భూముల్లో ఆరుతడి పంటలు జొన్న, మొక్కజొన్న, పెసర, మినుములు, ఉలవలు, ఇతర కూరగాయాల పంటలు సాగు చేసుకోవడం మంచిది.

పంటమార్పిడితో భూసారం



ఒకే రకమైన పంటలు కాకుండా మార్పు చేయడం వల్ల భూమి సారవంతంగా తయారవుతుంది. వీలైనంత వరకు తెగుళ్ల బాధ తగ్గుతుంది. దిగుబడి కూడా ఆశించినంత మేర వస్తుంది. కలుపు కూడా క్రమంగా తగ్గుముఖం పడుతుంది. దీనిపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. పక్క పొలంలో పండించిన పంటనే తాము పండించడం మానుకోవాలి. కొత్త పంటలను ఎంపిక చేసుకుని ముందుకు పోవాలి.

– వరలక్ష్మి వ్యవసాయాధికారి, ఐరాల



పంట మార్పిడి విధానంలో మంచి దిగుబడినిచ్చిన రాగి



బెండపంట



వంగతోట

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కేశవనారాయణ

తవణంపల్లె: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని వైద్యాధికారి డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలో దిగువమోదలపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అందులో 32 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భవతులు, బాలింతలు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం లావణ్య, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఆశాకార్యకర్తలు సౌందర్య, పుష్ప, నాగభూషణం పాల్గొన్నారు.

చిత్తూరులో యువతి అదృశ్యం

చిత్తూరు అర్బన్: నగరానికి చెందిన యువతి కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. టూ టౌన్ సీఐ నెట్టి కంటయ్య కథనం మేరకు.. నగరంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన యువతి శుక్రవారం ఇంట్లో చిన్న మనస్పర్థలు రావడంతో వెళ్లిపోయింది. యువతి మళ్లీ ఇంటికి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. యువతి ఆచూకీ తెలిస్తే ఫోన్ నంబర్ 94910 74517కు ఆచూకీ తెలపాలని సీఐ కోరారు.